సాక్షి నల్లగొండ

మంగళవారం : 9 : సెప్టెంబర్ : 2025



సాంకేతికతకు శ్రీకారం

విద్యుత్ సరఫరాలో లోపాన్ని వెంటనే గుర్తించేందుకు టీజీపీడీసీఎల్ సాంకేతిక విధానాన్ని అందుబాటులోకి తెచ్చింది. - 8లో



ప్రతిభకు ప్రోత్సాహకం

కేంద్ర కమ్యూనికేషన్ల మంత్రిత్వ శాఖ విద్యార్థులకు ప్రతిభా పోటీలు నిర్వహించి ఉపకార వేతనాలను మంజూరు చేస్తోంది. - 8లో

సాగర్ సమాచారం



పూర్తిస్థాయి నీటి మట్టం : 590 అడుగులు

ప్రస్తుత నీటి మట్టం	:	589.20 అడుగులు
ఇన్‌ఫ్లో	:	1,67,448 క్యూసెక్కులు
అవుట్ ఫ్లో	:	1,67,448 క్యూసెక్కులు
విద్యుదుత్పాదన కేంద్రం ద్వారా	:	33,658 క్యూసెక్కులు
కుడికాల్వ ద్వారా	:	9,700 క్యూసెక్కులు
ఎడమకాల్వ ద్వారా	:	9,166 క్యూసెక్కులు
ఏఎమ్మార్పీకి	:	2,400 క్యూసెక్కులు
వరద కాల్వకు	:	300 క్యూసెక్కులు

మిల్లుల్లో ధాన్యం ఉందా..!

- ధాన్యం ఇచ్చిందెంత? సీఎంఆర్ వచ్చిందెంత? రావాల్సిందెంత?
- వాస్తవాలు తేల్చేందుకు సిద్ధమైన యంత్రాంగం
- ఎఫ్‌సీఐ, పౌరసరఫరాల శాఖ సంయుక్త ఆధ్వర్యంలో తనిఖీలు
- ఉమ్మడి జిల్లాలోని మిల్లుల పరిశీలనకు ప్రణాళిక
- కేంద్ర ప్రభుత్వ ఆదేశాలతో రంగంలోకి దిగుతున్న బృందాలు



సాక్షి ప్రతినిధి, నల్లగొండ : కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) కోసం ఇచ్చిన ధాన్యం ఏయే మిల్లుల్లో ఎంత మేరకు ఉంది? సీఎంఆర్ కింద ఆయా మిల్లులు ఎంత బియ్యం ఇచ్చాయి? ఇంకా ఎంత బియ్యం ఇవ్వాల్సి ఉంది? అన్న లెక్కలు తేల్చేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎఫ్‌సీఐ), పౌరసరఫరాల శాఖ అధికారులతో కూడిన బృందాలతో జాయింట్ ఫిజికల్ వెరిఫికేషన్ (జేపీవీ) నిర్వహించాలని నిర్ణయించింది. ఉమ్మడి జిల్లాలో మిల్లుల్లో ఈ తనిఖీలు చేపట్టేందుకు ఎఫ్‌సీఐ ఆదేశాలు జారీ చేసింది. 2024–25 వానాకాలం, యాసంగి సీజన్లలో మిల్లర్లకు ఇచ్చిన ధాన్యం, ఎఫ్‌సీఐకి వచ్చిన సీఎంఆర్, ఇంకా రావాల్సి ఉన్న సీఎంఆర్‌కు సంబంధించిన ధాన్యం ఆయా మిల్లుల్లో ఉందా? లేదా? అన్న లెక్కలు తేల్చేందుకు సిద్ధమైంది. త్వరలోనే ఈ తనిఖీలు ప్రారంభం కానున్నాయి.

కేంద్ర ప్రభుత్వ ఆదేశాలతోనే రంగంలోకి..

గత ఆర్థిక సంవత్సరంలోని సీజన్లకు సంబంధించిన ధాన్యం, సీఎంఆర్ లెక్కలు పక్కాగా తేల్చాలని కేంద్ర వినియోగదారుల వ్యవహారాలు, ఆహారం, ప్రజా పంపిణీ మంత్రిత్వ శాఖ ఇటీవల అన్ని రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులకు లేఖ రాసింది. ఎఫ్‌సీఐ నేతృత్వంలోనే ఈ తనిఖీలు చేపట్టేందుకు నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ఎఫ్‌సీఐ తనిఖీ బృందాలను నియమిస్తూ ఉత్తర్వులు జారీచేసింది.

రావాల్సి ఉన్న సీఎంఆర్ (మెట్రిక్ టన్నుల్లో)

జిల్లా	వానాకాలం	యాసంగి	మొత్తం
నల్లగొండ	6,143	2,05,394	2,11,537
సూర్యాపేట	48,197	1,62,373	2,10,570
యాదాద్రి	34,600	1,65,000	1,99,600

30 రోజుల్లో సీఎంఆర్ ఇవ్వాలని నిబంధన

సాధారణంగా మిల్లులకు సీఎంఆర్ కోసం ఇచ్చిన ధాన్యాన్ని మరాడించి నెల రోజుల్లోగా ఎఫ్‌సీఐకి బియ్యాన్ని ఇవ్వాల్సి ఉంది. అయితే మిల్లుల వద్దే ధాన్యం నెలల తరబడి ఉంటోంది. సకాలంలో ఎఫ్‌సీఐకి సీఎంఆర్ ఇవ్వడం లేదు. ఒక సీజన్‌లో ఇచ్చిన ధాన్యం మరో సీజన్ ధాన్యం వచ్చే నాటికి కూడా మిల్లర్లు బియ్యాన్ని ఇవ్వడం లేదు. కొందరు మిల్లర్లు సంవత్సరాలు అవుతున్నా సీఎంఆర్ ఇవ్వడం లేదు. ఇలా జిల్లాలో పలువురు మిల్లర్లు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నా యంత్రాంగం చూసీచూడనట్లు వ్యవహరిస్తోంది.

మామూళ్ల మత్తులో కొందరు అధికారులు

సీఎంఆర్ కోసం ఇచ్చిన ధాన్యాన్ని కొందరు మిల్లర్లు మరాడించి బియ్యం అమ్ముకుంటున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. గతంలో నిర్వహించిన తనిఖీల్లో ఈ విషయం బయట పడింది. సీఎంఆర్ కోసం ఇచ్చిన ధాన్యం ఆయా మిల్లుల్లో లేదని తేలింది. ఒక సీజన్ ధాన్యాన్ని అమ్ముకుంటున్న మిల్లర్లు మరో సీజన్‌లో ధాన్యం వచ్చే వరకు ఆగి, అప్పుడు సీఎంఆర్ ఇస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. అంతేకాదు సీఎంఆర్ కోసం ఇచ్చిన ధాన్యాన్ని అమ్ముకోవడమే కాకుండా తక్కువ ధరకు రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసి సీఎంఆర్‌కు పెడుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. పౌరసరఫరాల సంస్థ, పౌర సరఫరాల శాఖ అధికారులు కొందరు మిల్లర్లతో కుమ్మక్కై మామూళ్లు తీసుకుని కఠినంగా వ్యవహరించడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. ఏళ్ల తరబడి ధాన్యం తీసుకొని సీఎంఆర్ బియ్యం ఇవ్వకున్నా నామమాత్రపు కేసులతో మమ అనిపిస్తున్నట్లు విమర్శలు ఉన్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో మిల్లుల్లో ధాన్యం నిల్వలు, సీఎంఆర్‌కు సంబంధించిన లెక్కలను తేల్చేందుకు ఎఫ్‌సీఐ చర్యలు చేపట్టింది.

2024-25 వానాకాలం, యాసంగి ధాన్యం, బియ్యం వివరాలిలా..

- నల్లగొండ జిల్లాలో వానాకాలం సీజన్‌లో 2,75,840 మెట్రిక్ టన్నుల ధాన్యం మిల్లులకు కేటాయించగా, 1,86,218 మెట్రిక్ టన్నుల బియ్యం ఇచ్చారు. ఇంకా 6,143 మెట్రిక్ టన్నులు ఇవ్వలేదు. యాసంగి సీజన్‌లో 6,03,305 మెట్రిక్ టన్నుల ధాన్యం మిల్లులకు ఇవ్వగా, అందులో 4,07,671 మెట్రిక్ టన్నుల బియ్యం సీఎంఆర్ కింద ఇవ్వాల్సి ఉండగా, 2,02,277 మెట్రిక్ టన్నులే ఇచ్చాయి. ఇంకా 2,05,394 మెట్రిక్ టన్నుల బియ్యం ఇవ్వాల్సి ఉంది.
- సూర్యాపేట జిల్లాలో వానాకాలం సీజన్ మిల్లులకు 1,65,353 మెట్రిక్ టన్నుల ధాన్యం ఇవ్వగా, ఇప్పటివరకు 64,062 మెట్రిక్ టన్నుల బియ్యమే ఇచ్చారు. ఇంకా 48,197 మెట్రిక్ టన్నుల బియ్యం ఇవ్వాల్సి ఉంది. యాసంగి సీజన్‌లో 2,89,690 మెట్రిక్ టన్నుల ధాన్యం ఇవ్వగా, 31,686 మెట్రిక్ టన్నుల బియ్యమే సీఎంఆర్ కింద మిల్లర్లు ఇచ్చారు. ఇంఆక 1,62,373 మెట్రిక్ టన్నుల బియ్యం ఇవ్వాల్సి ఉంది.
- యాదాద్రి భువనగిరి జిల్లాలో వానాకాలం సీజన్‌కు 1,50,600 మెట్రిక్ బియ్యం మిల్లర్ల నుంచి రావాల్సి ఉండగా, ఇప్పటివరకు 1,16,000 మెట్రిక్ టన్నుల బియ్యమే వచ్చింది. ఇంకా 34,600 మెట్రిక్ టన్నుల బియ్యం రావాల్సి ఉంది. యాసంగి సీజన్‌లో 2.54 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం రావాల్సి ఉండగా, ఇప్పటివరకు ఇప్పటివరకు 90 వేల మెట్రిక్ టన్నుల బియ్యమే వచ్చింది. ఇంకా 1,64,000 మెట్రిక్ టన్నుల బియ్యం రావాల్సి ఉంది.

గోడు వినండి.. పరిష్కరించండి



హెడ్‌మాస్టర్‌ను తిరిగి పంపాలని కలెక్టర్ ఇలా త్రిపాఠికి వినతిపత్రం అందజేస్తున్న విద్యార్థులు

- గ్రీవెన్స్ డేలో కలెక్టర్‌కు వినతుల వెల్లువ

నల్లగొండ : అమ్మా.. మా గోడు విని.. మా సమస్య పరిష్కరించాలని పలువురు బాధితులు గ్రీవెన్స్‌లో కలెక్టర్ ఇలా త్రిపాఠికి మొర పెట్టుకున్నారు. సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన గ్రీవెన్స్ డేకు జనం పెద్ద ఎత్తున తరలివచ్చి వినతులు సమర్పించారు. ఫిర్యాదులు స్వీకరించిన కలెక్టర్ వాటిని పరిష్కరించాలని ఆయా శాఖల అధికారులకు పంపారు.

అధికారులు పాఠశాలలను సందర్శించాలి

మండల ప్రత్యేక అధికారులు తప్పనిసరిగా పాఠశాలలను సందర్శించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. ప్రజావాణిలో ఫిర్యాదులు స్వీకరించిన అనంతరం ఆమె అధికారులతో సమావేశమై మాట్లాడారు. జిల్లాలో జ్వరాలు ప్రత్యేకించి టైఫాయిడ్ కేసులు పెరుగుతున్నాయని, ప్రజలు వ్యక్తిగత పరిశుభ్రతపై దృష్టి పెట్టేలా అవగాహన కల్పించాలన్నారు. జాతీయ కుటుంబ ప్రయోజన పథకం కింద దరఖాస్తులు స్వీకరించాలన్నారు. వివిధ శాఖల్లో పని చేస్తూ గ్రామ పాలన అధికారులుగా నియమించబడిన వారిని వెంటనే విధుల నుంచి రిలీవ్ చేయాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్ కోరారు. సమావేశంలో స్పెషల్ కలెక్టర్ సీతారామారావు, ఇన్‌చార్జి డీఆర్‌ఓ వై.అశోక్‌రెడ్డి, ఆర్డీఓలు రమణారెడ్డి, శ్రీదేవి, గృహ నిర్మాణ పీడీ రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మా హెడ్మాస్టర్‌ను తిరిగి పంపించండి

తమ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు డిప్యుటేషన్‌పై వేరే మండలానికి పంపడంతో.. తాము విద్యా పరంగా నష్టపోతున్నామని.. మా ప్రధానోపాధ్యాయురాలిని తిరిగి పంపాలని ఆ పాఠశాల విద్యార్థులు వారి తల్లిదండ్రులతో కలిసి కలెక్టరేట్‌కు వచ్చారు. కలెక్టర్ వారి సమస్య పరిష్కరిస్తానని చెప్పి వారికి చాక్లెట్లు ఇచ్చి పంపించారు.

– నాంపల్లి మండలం నర్సింహులగూడెం ప్రాథమిక పాఠశాల విద్యార్థులు

మూడు నెలలుగా పింఛన్ రావడం లేదు



తన కుమారునికి మూడు నెలల నుంచి దివ్యాంగ పింఛన్ రావడం లేదంటూ 18 సంవత్సరాల తన దివ్యాంగ కుమారుడు బొల్ల వెంకట్‌రెడ్డిని బుజనా వేసుకుని కలెక్టరేట్‌కు సత్యనారాయణరెడ్డి వచ్చాడు. ఐరిష్‌తో పాటు వేలిముద్ర రాకపోవడంతో పింఛన్ ఇవ్వడం లేదు. వెంటనే పింఛన్ అందేలా చూడాలని తన కుమారుడిని భుజాన వేసుకుని కలెక్టర్‌కు తన గోడు విన్నవించాడు సత్యనారాయణరెడ్డి.

– బొల్ల సత్యనారాయణరెడ్డి, నెల్లికల్, తిరుమలగిరి సాగర్ మండలం

ఇందిరమ్మ ఇల్లు ఇవ్వాలని పదే పదే వస్తూ..



ఇందిరమ్మ ఇల్లు ఇవ్వాలని చర్లపల్లికి చెందిన దివ్యాంగుడు మారయ్య కలెక్టరేట్‌కు మోకాళ్లపై పాకుతూ కలెక్టరేట్‌కు వచ్చాడు. తాను ఇప్పటికే మూడుసార్లు కలెక్టర్‌కు దరఖాస్తు చేసుకున్నా.. మంజూరు కాలేదని.. ఇల్లు ఇచ్చేంత వరకు కలెక్టర్ వద్దకు వస్తానని చెప్పాడు.

–ఎరుపుల మారయ్య, చర్లపల్లి, నల్లగొండ

న్యూస్‌రీల్

గ్రంథాలయాలకు నిధులు సమకూర్చుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న హఫీజ్ ఖాన్

రామగిరి(నల్లగొండ) : జిల్లా కేంద్ర గ్రంథాలయంతోపాటు నాగార్జునసాగర్, చండంపేట, మునుగోడు, దేవరకొండ ఇతర గ్రంథాలయ నిర్వహణకు నిధులు సమకూర్చుకోవాలని జిల్లా గ్రంథాలయ చైర్మన్ ఎంఏ హఫీజ్ ఖాన్ అన్నారు. జిల్లా కేంద్ర గ్రంథాలయంలో సోమవారం నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో పలు తీర్మానాలు చేశారు. కలెక్టర్ అనుమతితో పాత టౌన్ హాల్ స్థలంలో జిల్లా గ్రంథాలయ సంస్థ భవనాన్ని నిర్మించాలని కమిటీ సభ్యులు నిర్ణయించారు. జిల్లా గ్రంథాలయంతోపాటు ఇతర గ్రంథాలయాల్లో పనిచేస్తున్న స్వీపర్ల చార్జీలు 25 శాతం పెంచాలని తీర్మానించారు.

10న సురవరం సంస్మరణ సభ

నల్లగొండ టౌన్ : సీపీఐ జాతీయ మాజీ కార్యదర్శి, నల్లగొండ మాజీ ఎంపీ సురవరం సుధాకర్‌రెడ్డి సంస్మరణ సభను ఈ నెల 10వ తేదీన పట్టణంలోని దేవరకొండ రోడ్డులో గల జీఎల్ గార్డెన్స్‌లో నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్సీ, సీపీఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంస్మరణ సభకు శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, నల్లగొండ పార్లమెంట్ సభ్యుడు కుందూరు రఘువీర్‌రెడ్డి, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, ప్రెస్ అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి, సీపీఐ జాతీయ కౌన్సిల్ సభ్యుడు పల్లా వెంకట్‌రెడ్డి, సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి హాజరవుతారని తెలిపారు. సభకు అన్ని వర్గాల ప్రజలు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

పార్టీల ప్రతినిధులతో జెడ్పీ సీఈఓ సమావేశం



మాట్లాడుతున్న జెడ్పీ సీఈవో

నల్లగొండ : ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఓటరు, పోలింగ్ స్టేషన్ల జాబితాపై అభిప్రాయాల సేకరణ నిమిత్తం సోమవారం జిల్లా పరిషత్ కార్యాలయంలో జెడ్పీ సీఈఓ శ్రీనివాసరావు రాజకీయ పార్టీల నాయకులతో సమావేశమయ్యారు. జాబితాలపై అభ్యంతరాలు స్వీకరించారు. ఓటరు జాబితాలో మార్పు చేర్పులు చేసే అధికారం తమకు లేదని సంబంధిత ఆర్డీఓలు ఈఆర్వోల ద్వారా చేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా రాజకీయ పార్టీల నాయకులు మాట్లాడుతూ 353 ఎంపీటీసీలకు సంబంధించిన పూర్తి వివరాలను ముందుగానే తమకు ఇవ్వాలని, ఏ బూత్ ఏ గ్రామంలోకి వస్తుందో జాబితా ఇవ్వాలని విన్నవించారు. సమావేశంలో నాయకులు గుమ్మల మోహన్‌రెడ్డి, లింగస్వామి, పి.మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

ట్రిపుల్‌ఆర్ బాధితులకు అండగా నిలుస్తాం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ సత్యం

మునుగోడు : ప్రభుత్వం నూతనంగా నిర్మిస్తున్న ట్రిపుల్ ఆర్‌లో భూములు కోల్పోతున్న రైతులకు తాము అండగా నిలిచి పోరాడుతామని ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం అన్నారు. సోమవారం మునుగోడు సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ట్రిపుల్ ఆర్ రోడ్డు కోసం దక్షిణ భాగంలో భూ సేకరణలో అధికారులు చౌటుప్పల్‌లోని దివిస్ కంపెనీని కాపాడేందుకు అలైన్‌మెంట్‌లో మార్పు చేశారని ఆరోపించారు. దానివల్ల అనేక మంది పేదల భూములు కోల్పోవాల్సిన పరిస్థితి దాపురించిందన్నారు. ట్రిపుల్ ఆర్‌లో భూములు కోల్పోతున్న రైతులకు మార్కెట్ ధర కంటే అదనంగా 10 రెట్ల పరిహారం అందించేలా ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామన్నారు. సమావేశంలో నాయకులు గుర్జ రామచంద్రం, చాపల శ్రీను, బి.లాలు, రమేష్, దుబ్బ వెంకన్న, ఈదులకంటి కైలాస్, పాండు, వెంకన్న, సత్తమ్మ, దయాకర్, శంకర్, ముత్తయ్య పాల్గొన్నారు.

బీజేపీ రాష్ట్ర కార్యవర్గంలో ఐదుగురికి చోటు

- సీనియర్ నేత గంగిడి మనోహర్‌రెడ్డికి దక్కని స్థానం

సాక్షి ప్రతినిధి, నల్లగొండ : ఉమ్మడి జిల్లాకు చెందిన బీజేపీ సీనియర్ నాయకులు ఐదుగురికి రాష్ట్ర కార్యవర్గంలో చోటు దక్కింది. ముగ్గురికి ఉపాధ్యక్ష పదవులు దక్కగా, మరొకరికి రాష్ట్ర కార్యదర్శి పదవి లభించింది. బీజేపీ జాతీయ అధ్యక్షుడు జగత్ ప్రకాష్ నడ్డా ఆమోదంతో రాష్ట్ర కార్యవర్గాన్ని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచంద్రరావు సోమవారం ప్రకటించారు. రాష్ట్ర ఉపాధ్యక్షులుగా డాక్టర్ బూర నర్సయ్యగౌడ్, కాసం వెంకటేశ్వర్లు యాదవ్, జరుప్లావత్ గోపి (కళ్యాణ్‌నాయక్)లను నియమించారు. రాష్ట్ర కార్యదర్శిగా తూటుపల్లి రవికుమార్, ప్రధాన కార్యదర్శిగా భువనగిరికి చెందిన వేముల అశోక్‌కు అవకాశం కల్పించారు.



కాసం వెంకటేశ్వర్లు



బూర నర్సయ్యగౌడ్

సంజయ్ అనుచరుడిగా ముద్ర పడినందుకేనా..

ఉమ్మడి జిల్లాలో పార్టీ సీనియర్ నాయకుడు, పార్టీ కార్యక్రమాల్లో నిత్యం చురుగ్గా వ్యవహరించే గంగిడి మనోహర్‌రెడ్డికి ఈసారి రాష్ట్ర కార్యవర్గంలో చోటు దక్కలేదు. విద్యార్థి దశ నుంచే ఏబీవీపీలో అనేక సంవత్సరాలు పనిచేసిన ఆయన గతంలో పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా, పార్టీ కోశాధికారిగా, ప్రధాన కార్యదర్శితో పాటు వివిధ బాధ్యతల్లో చాలా కాలం సేవలందించారు. కాగా, బండి సంజయ్ ప్రధాన అనుచరుడిగా మనోహర్‌రెడ్డి వ్యవహరించారని, రాష్ట్ర కార్యవర్గంలో ఆయనకు చోటు కల్పించకుండా కొందరు ఎంపీలే నడ్డాపై ఒత్తిడి చేశారని అనుచరులు మండిపడుతున్నారు. దీనిపై మనోహర్‌రెడ్డి స్పందిస్తూ.. కార్యవర్గంలో తన పేరు లేకపోవడం వాస్తవమేనని, పార్టీ తన సేవలను మరో రకంగా ఉపయోగించుకుంటుందేమోనని పేర్కొన్నారు. క్రియాశీల కార్యకర్తగా ఎప్పుడూ పార్టీ కోసం పనిచేస్తానని స్పష్టం చేశారు.

ఏఎన్‌ఎంలపై పని ఒత్తిడి తగ్గించాలి



ధర్నాలో మాట్లాడుతున్న పల్లా దేవేందర్‌రెడ్డి

నల్లగొండ టౌన్ : ఏఎన్‌ఎంలపై పని ఒత్తిడిని తగ్గించాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో స్థానిక కలెక్టరేట్ ఎదుట నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడారు. ఏఎన్‌ఎంలు వివిధ రకాల రికార్డులను ఆన్‌లైన్‌లో నమోదు కోసం రాత్రి వేళలో కూడా పనిచేయాల్సి వస్తోందన్నారు. అనంతరం కలెక్టర్ ఇలా త్రిపాఠికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కేఎస్‌రెడ్డి, విశ్వనాథుల లెనిన్, ఆర్.ఈశారాణి, ఎస్.పద్మ, సరిత, భవాని, హైమావతి, హరిత, భవాని, శారద, నిర్మల, శిల్ప, మాధురి, అనిత, సునీత, జ్యోతి పాల్గొన్నారు.

12న అమరవీరుల స్మారక స్థూపం ఆవిష్కరణ



సభావేదిక స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మందుల సామేల్, ఎమ్మెల్సీ శంకర్‌నాయక్

శాలిగౌరారం : మండలంలోని వల్లాల గ్రామంలో నాటి నిజాం నిరంకుశత్వానికి బలైన అమరవీరుల జ్ఞాపకార్థ పీసీసీ మాజీ అధ్యక్షుడు వి.హన్మంతరావు సొంత ఖర్చులు రూ.10 లక్షలతో నిర్మించిన అమరవీరుల స్మారక స్థూపాన్ని ఈనెల 12వ తేదీన ఆవిష్కరిస్తున్నట్లు ఎమ్మెల్యే మందుల సామేలు, పీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ శంకర్‌నాయక్ తెలిపారు. సోమవారం వారు వల్లాలకు వచ్చి సభావేదిక ఏర్పాటు, సౌకర్యాల కల్పన తదితర అంశాలపై కాంగ్రెస్‌పార్టీ మండల నాయకత్వానికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అమరవీరుల స్థూపం ఆవిష్కరణకు పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్, జిల్లా ఇన్‌చార్జి మంత్రి అడ్లూరు లక్ష్మణ్, రాష్ట్ర మంత్రులు నలమాద ఉత్తమ్ కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ముఖ్య అతితులుగా హాజరుకానున్నారని తెలిపారు. సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు కందాల సమరంరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ పాదూరి శంకర్‌రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ తాళ్లూరి మురళి, వైస్‌చైర్మన్ నరిగె నర్సింహ్మా, బొల్లికొండ గణేశ్, తహసీల్దార్ జమీరుద్దీన్, ఎంపీడీఓ జ్యోతిలక్ష్మి, షేక్ ఇంతియాజ్, వెంకటేశ్వర్లు, యాదగిరి, అంజయ్య పాల్గొన్నారు.

సైబర్ దోపిడీ..

జిల్లాపై సైబర్ పంజా విసురుతోంది. ఆధునీక పద్ధతుల్లో సైబర్ మోసాలకు పాలపడుతూ కోట్ల రూపాయలు కాజేస్తున్నారు. వీరు, వారు అనే తేడా లేకుండా అందరినీ మోసగిస్తూ బ్యాంకు ఖాతాలను ఖాళీ చేస్తున్నారు. చివరికి పోలీసులను సైతం సైబర్ నేరగాళ్లు వదలడం లేదు. సైబర్ నేరాలు పెద్ద ఎత్తున జరుగుతున్నా ఆ కేసులను చేధించడంలో పోలీసులు విఫలమయ్యారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ మోసాల్లో తొలుత పెద్ద ఎత్తున నగదును పోగొట్టుకుని.. ఆ తర్వాత పోలీసులను ఆశ్రయించినా ఫలితం ఉండడం లేదు.

- కేసులు నమోదయ్యాయని వాట్సప్ కాల్ ద్వారా సైబర్ నేరగాళ్ల బెదిరింపు
- రూ.లక్షలు పోగొట్టుకుంటున్న బాధితులు
- మోసపోయే వారిలో ఎక్కువగా ఉద్యోగులు, మేధావులే
- అవగాహన లోపమే కారణం



మిర్యాలగూడ : జిల్లాలో రోజూ ఎక్కడో ఓ చోట సైబర్ మోసాలు జరుగుతూనే ఉన్నాయి. ఢిల్లీ, పశ్చిమబెంగాల్, రాజస్తాన్, ఉత్తర్‌ప్రదేశ్, బీహార్, మహారాష్ట్ర, కర్ణాటక ప్రాంతాల నుంచి సైబర్ నేరగాళ్లు.. ఆన్‌లైన్‌లో చదువుకున్న వారిని టార్గెట్ చేస్తూ మోసాలకు పాల్పడుతున్నారు. ఫోన్, ఆధార్ నంబర్లు సేకరించి వారికి నేరుగా వాట్సప్ కాల్ చేసి బెదిరింపులకు పాల్పడుతూ రూ.లక్షల్లో వసూలు చేస్తున్నారు. మొత్తంగా అమాయకులతోపాటు చదువుకున్న వారిని టార్గెట్ చేసి పెద్ద ఎత్తున మోసాలకు పాల్పడుతున్నారు. ఇందులో ప్రభుత్వ ఉద్యోగులు, రిటైర్డ్ ఉపాధ్యాయులు, న్యాయవాదులు, డాక్టర్లు, వ్యాపారస్తులు, వివిధ వృత్తుల్లో ఉన్నవారు పెద్ద ఎత్తున డబ్బులు పోగొట్టుకుంటున్నారు.

ఇటీవల జరిగిన మోసాలు..

- ఐదు రోజుల క్రితం మిర్యాలగూడ పట్టణానికి చెందిన రిటైర్డ్ ఉద్యోగికి సైబర్ నేరగాడు వాట్సప్ కాల్ చేసి మీపై పోక్సో కేసు నమోదు అయిందని, అంతర్జాతీయ క్రిమినల్స్‌తో మీకు సంబంధం ఉందని నమ్మించి బెదిరించాడు. సుప్రీం కోర్టు ద్వారా బెయిల్ ఇప్పించానని, దీనికి గాను రూ.30,70,719 చెల్లించాలని అది కూడా ఆర్టీజీఎస్ చేయాలని చెప్పాడు. అంత డబ్బు తన వద్ద లేవని తాను ఏ తప్పూ చేయలేదని ప్రాధేయపడినా చివరికి రూ.20లక్షలు చెల్లిస్తే.. మిగతావి నేను చెల్లిస్తానని నమ్మబలికి మూడు రోజులు మానసికంగా చిత్రహింసలకు గురి చేశారు. దీంతో వారు ఓ మాజీ ఎమ్మెల్యే సహకారంతో ఎస్పీని ఆశ్రయించడంతో సైబర్ నేరమని తేలడంతో ఊపిరి పీల్చుకున్నారు.
- నల్లగొండ జిల్లా కేంద్రంలో ఓ రిటైర్డ్ ఉద్యోగిని ఆదాయానికి మించి ఆస్తులు ఉన్నాయని మీపై కేసు నమోదు అయిందని దాని నుంచి బెయిల్ రావాలంటే తక్షణమే రూ.35 లక్షలు చెల్లించాలని సైబర్ నేరగాడు బెదిరించారు. అది నమ్మిన బాధితుడు నగదు చెల్లించాడు. ఆ నగదు సరిపోదని ఇంకా కావాలని అడగంతో ఇంట్లో ఉన్న బంగారాన్ని కుదవ పెట్టేందుకు వెళ్తుండగా తెలిసిన కానిస్టేబల్ కలవడంతో విషయం చెప్పాడు. వెంటనే బాధితుడ్ని క్రైం ఉన్నతాధికారుల వద్దకు తీసుకెళ్లి విషయం చెప్పడంతో సైబర్ నేరమని తేలింది.
- ఈ ఏడాది జనవరిలో జిల్లాకు చెందిన 57 ఏండ్ల ప్రభుత్వ ఉద్యోగికి ఓ వ్యక్తి పోలీసు అధికారిగా ఫోన్ చేసి రూ.2 కోట్ల మనీ లాండరింగ్ కేసులో అతని ఆధార్‌కార్డును ఉపయోగించారని, వాట్సప్‌లో మొదటగా అరెస్ట్ వారెంట్, కోర్టు ఆర్డర్లు పంపి భయపెట్టి అతని వద్ద రూ.6.5 లక్షలు కాజేశారు.
- ఈ ఏడాది మార్చి 29న నల్లగొండ జిల్లాలో సైబర్ కేసు నమోదైంది. అందులో హైదరాబాద్‌కు చెందిన 49 ఏండ్ల ఓ ప్రభుత్వ ఉద్యోగికి.. సైబర్ నేరగాళ్లు ఫోన్ చేశారు. ట్రాయ్ అధికారిగా వీడియో కాల్ చేసి బెదిరించి అతని వద్ద రూ.8.5లక్షలు కాజేశారు.
- ఏడాది మార్చిలో జిల్లాకు చెందిన ఓ ఎమ్మెల్యేకు సైబర్ నేరగాళ్లు వాట్సప్ ద్వారా న్యూడ్ వీడియో కాల్ చేసి బెదిరించి డబ్బులు డిమాండ్ చేసిన సంఘటన చోటు చేసుకుంది.
- నార్కట్‌పల్లి మండలంలో సైబర్ మోసాలకు గురై ఒకరు రూ.30 లక్షలు పోగొట్టుకున్నారు.
- గత నెలలో వాడపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో లోన్ యాప్‌ను ఓపెన్ చేయగా అతని ఖాతా నుంచి రూ.2 లక్షలకు పైగా మాయమయ్యాయి. ఈ విషయంపై వాడపల్లి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది.

జిల్లాలోనూ నేరగాళ్లు..

గత ఏడాది మిర్యాలగూడకు చెందిన ఓ నాయకుడు కొందరి పేర్లతో ఖాతాలు తెరిపించి ముంబై, దుబాయ్‌లోని సైబర్ నేరగాళ్లకు ఆ ఖాతాల వివరాలు అందించి ఖాతాదారుల అకౌంట్లలో సైబర్ నేరాల ద్వారా పెద్ద మొత్తంలో డబ్బు జమ చేయించాడు. కొంత మొత్తం ఖాతాదారులకు కమీషన్ ఇచ్చి కోట్ల రూపాయలను స్వాహా చేసినట్లు వెలుగులోకి రావడంతో ముంబై పోలీసులు అతడిని అరెస్ట్ చేశారు. జిల్లాకు చెందిన ఇద్దరు బీటెక్ విద్యార్థులు ఆన్‌లైన్ గేమ్స్‌లో డబ్బులను పోగొట్టుకుని సులువుగా డబ్బులు సంపాదించాలని సైబర్ నేరాలకు పాల్పడుతూ జిల్లా పోలీసులకు చిక్కారు. వీరితోపాటు హైదరాబాద్‌కు చెందిన మరొకరు ఈ కేసులో అరెస్ట్ అయ్యారు.

రూ.కోట్లలో మోసం.. రూ.లక్షల్లో రికవరీ

సైబర్ మోసాల్లో బాధితులు కోట్ల రూపాయలను కోల్పోతున్నారు. డబ్బులు పోయాక పోలీసులను ఆశ్రయించినా, సైబర్ పోలీసులకు ఫిర్యాదు చెసినా రికవరీ పెద్దగా ఉండడం లేదు. రాష్ట్ర వ్యాప్తంగా ఈ ఏడాది జనవరి నుంచి జూన్ వరకు రూ.681కోట్లు బాధితులు నష్టపోగా కేవలం రూ.107కోట్లు మాత్రమే రికవరి అయినట్లు సమాచారం. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 6,848 మంది బాధితులకు రూ.53.5కోట్లు తిరిగి ఇప్పించారు.

ఆన్‌లైన్ మోసాలకు గురికావద్దు



ఆన్‌లైన్ మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. పోలీసులు, సీబీఐ, ఈడీ వంటి సంస్థల పేరిట ఎవరూ ఫోన్లు, వాట్సప్ కాల్ చేయరు. తప్పుడు కేసులు, అరెస్ట్ వారెంట్ ఉందని బెదిరిస్తారు అలాంటి వారిపై జాగ్రత్తగా ఉండాలి. అలాంటి సందర్భాల్లో వ్యక్తిగత బ్యాంక్ వివరాలు, ఓటీపీ ఇవ్వకూడదు. అలాంటి ఫోన్‌కాల్స్‌కు భయపడవద్దు. అనుమానం వస్తే స్థానిక పోలీస్‌స్టేషన్‌లో లేదా 1930కు కాల్ చేసి ఫిర్యాదు చేయాలి.

– రాజశేఖర్‌రాజు, డీఎస్పీ, మిర్యాలగూడ

క్లుప్తంగా

పశువులు తరలిస్తున్న వాహనం పట్టివేత

చౌటుప్పల్ : అక్రమంగా పశువులను తరలిస్తున్న వాహనాన్ని చౌటుప్పల్ పట్టణ కేంద్రంలో సోమవారం పోలీసులు పట్టుకున్నారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలోని సంతలో 40పశువులను కొనుగోలు చేసి డీసీఎంలో హైదరాబాద్‌లోని బహదూర్‌పురకు తరలిస్తున్నారు. ఈ క్రమంలో పట్టణంలోని వలిగొండ క్రాస్‌రోడ్డు వద్ద తనిఖీ చేస్తున్న పోలీసులు ఈ డీసీఎంను పట్టుకున్నారు. అందులో 20ఆవులు, 20 ఎద్దులు ఉన్నాయి. వాటిని గోశాలకు తరలించారు. వాహనం డ్రైవర్ ఎండీ ఇస్మాయిల్(50)తోపాటు మరో వ్యక్తి ఎండీ ఫిరోజ్(32)లపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మన్మథకుమార్ తెలిపారు.

కానిస్టేబుల్‌పై దాడి కేసులో ఐదుగురు రిమాండ్

కోదాడరూరల్ : కోదాడ పట్టణంలో మూడు రోజుల క్రితం వినాయక శోభాయాత్రలో రెండు వర్గాల మధ్య జరుగుతున్న ఘర్షణను ఆపేందుకు ప్రయత్నించిన కానిస్టేబుల్ నరేష్‌పై దాడి చేసిన ఐదుగురిని సోమవారం పోలీసులు రిమాండ్‌కు తరలించారు. దాడి చేసినవారిపై విధులకు ఆటంకం, హత్యాయత్నం సెక్షన్‌ల కింద కేసు నమోదు చేసి శ్రీధర్, అరవింద్, సుజిత్, నాగరాజు, యజ్ఞేష్‌చౌదరిలను అరెస్ట్ చేసినట్లు తెలిపారు. వీరిని హుజూర్‌నగర్ సబ్‌జైలుకు తరలించినట్లు పట్టణ పోలీసులు తెలిపారు.

జూదం స్థావరంపై ఎస్‌ఓటీ పోలీసుల దాడులు

ఆత్మకూరు(ఎం): ఆత్మకూరు(ఎం) మండల కేంద్రంలో జూదం స్థావరంపై ఎస్‌ఓటీ పోలీసులు సోమవారం సాయంత్రం దాడులు చేశారు. ఈ సందర్భంగా పేకాట ఆడుతున్న నలుగురిని అరెస్టు చేసి స్థానిక పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు. వారి వద్ద రూ.6960 నగదు, నాలుగు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

ఇద్దరు పీఏసీఎస్ డైరెక్టర్ల సస్పెన్షన్

గుండాల : గుండాల పీఏసీఎస్‌లో రుణాలు బాకీ ఉండటంతో ఇద్దరు డైరెక్టర్లను పాలక వర్గం నుంచి తొలగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. డీసీఓ శ్రీధర్ తెలిపిన వివరాల ప్రకారం.. అనంతారం డైరెక్టర్ చాడ పెంటమ్మ చిరు వ్యాపారుల రుణం రూ.47,011, వెల్మజాల డైరెక్టర్ సంగి బాలకొమురయ్య పంట రుణం రూ.2.35 లక్షలు సకాలంలో చెల్లించక పోవడంతో వీరిని పదవి నుంచి తొలగించినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

మహాశివుడికి అభిషేక పూజలు

యాదగిరిగుట్ట: యాదగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో సోమవారం సంప్రదాయ పూజలు కొనసాగాయి. కొండపైన యాదగిరీశుడి క్షేత్రానికి అనుబంధంగా కొనసాగుతున్న శ్రీపర్వత వర్ధిని సమేత రామలింగేశ్వరస్వామి వారి ఆలయంలో మహా శివుడికి, స్పటిక లింగానికి రుద్రాభిషేకం, బిల్వా అర్చన పూజలు విశేషంగా నిర్వహించారు. ఆయా పూజల్లో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం యాగశాలలో చండీ హోమం జరిపించారు. సాయంత్రం శ్రీపర్వత వర్ధిని సమేత రామలింగేశ్వరస్వామి వారి సేవను ఊరేగించారు. కాగా.. సంపూర్ణ చంద్ర గ్రహణం నేపథ్యంలో ఆలయంలో సోమవారం వేకువజామునే సంప్రోక్షణ నిర్వహించారు.

మాన్యువల్‌కు స్వస్తి.. సాంకేతికతకు శ్రీకారం

- కరెంట్ కష్టాల సత్వర పరిష్కారానికి 'ఏయిమ్స్' యాప్ రూపొందించిన టీజీఎస్‌పీడీసీఎల్
- దీని సాయంతో లైన్‌మెన్ నుంచి ఎస్‌ఈ వరకు సమాచారం
- విద్యుత్ సరఫరా పునరుద్ధరణలో జాప్యానికి చెక్
- కొనసాగుతున్న నెట్‌వర్క్ మ్యాపింగ్ ప్రక్రియ


వంగపల్లి ఫీడర్‌పై ఏయిమ్స్ మొబైల్ యాప్‌లో జీఐఎస్ మ్యాపింగ్ చేస్తున్న లైన్‌మెన్

ఆలేరు: ప్రకృతి వైపరీత్యాలు సంభవించి విద్యుత్ స్తంభాలు నేలకొరిగినప్పుడు, ఈదురు గాలులకు తీగలు తెగినప్పుడు విద్యుత్ సరఫరా నిలిచిపోతుంది. ఎవరో ఒకరు విద్యుత్ అధికారులు, సిబ్బందికి చెబితే తప్ప సమస్య వారికి తెలిసేది కాదు. విద్యుత్ సరఫరా లోపాన్ని గుర్తించేందుకు పోల్ నుంచి పోల్‌ను పరిశీలిస్తే కానీ సమస్య సిబ్బందికి తెలిసేది. దీనిని గుర్తించడానికి ఎలాంటి సాంకేతిక పరిజ్ఞానం ఉండేది కాదు. దీంతో లోపాన్ని గుర్తించి విద్యుత్ సరఫరా పునరుద్ధరణకు సిబ్బందికి చాలా సమయం పడుతుంది. ఇలాంటి ఇబ్బందులకు చెక్ పెట్టేందుకు తెలంగాణ సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ(లి)టీజీఎస్‌పీడీసీఎల్ మాన్యువల్ పద్ధతికి స్వస్తి పలికి సాంకేతిక విధానాన్ని అందుబాటులోకి తీసుకువచ్చింది.

ఏయిమ్స్ మొబైల్ యాప్

భవిష్యత్‌లో ఈ తరహా కరెంట్ కష్టాల సత్వర పరిష్కారానికి డిస్కమ్ 'ఏయిమ్స్' (అసెట్ ఇన్‌స్పెక్షన్ మెయింటెన్స్ సిస్టం)మొబైల్ యాప్‌ను రూపొందించింది. ఎక్కడ సమస్య వచ్చినా వెంటనే క్షేత్రస్థాయిలో లైన్‌మెన్ నుంచి ఎస్‌ఈ వరకు ఈ యాప్ ద్వారా సమాచారం వెళ్లి, వారిని అప్రమత్తం చేస్తుంది. తద్వారా క్షేత్రస్థాయిలో లైన్ల వారీగా డిఫాల్ట్ లోకేషన్ వివరాలు అధికారులు, సిబ్బంది అరచేతిలో అందుబాటులోకి రానున్నాయి. దీంతో సిబ్బంది సులువుగా డిఫాల్ట్ లోకేషన్‌కు చేరుకొని, సాధ్యమైనంత తొందరగా సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటారు. ఈక్రమంలో గతంలో మాదిరిగా విద్యుత్ నిర్వహణ లోపాలను గుర్తించి సరఫరా పునరుద్ధరణలో జరిగే జాప్యానికి చెక్ పడుతుంది.

జీఐఎస్ మ్యాపింగ్

యాదాద్రి జిల్లాలోని 11కేవీ, 33కేవీ ఫీడర్లతోపాటు సబ్‌స్టేషన్లు, పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ స్తంభాలు, అండర్‌గ్రౌండ్ కేబుల్, ఏబీ స్విచ్‌లు, కండక్టర్లు, డీటీఆర్‌లు తదితర నెట్‌వర్క్ భాగాల పూర్తి వివరాలను నిల్వ చేయడానికి భౌగోళిక సమాచార వ్యవస్థ (జీఐఎస్) సాంకేతికను ఉపయోగిస్తున్నారు. ఈమేరకు జిల్లా వ్యాప్తంగా అధికారులు, సిబ్బంది రెండు నెలలుగా ఈ వివరాలను సేకరిస్తూ జీఐఎస్‌లో నిక్షిప్తం చేస్తూ మ్యాపింగ్ ప్రక్రియ చేస్తున్నారు.

డేటా మొత్తం డిజిటలైజేషన్

యాప్ ద్వారా డిస్కం నెట్‌వర్క్ వివరాలన్నీ డిజిటలైజేషన్ చేస్తుంది. సబ్‌స్టేషన్‌లు, ట్రాన్స్‌ఫార్మర్లు ఎక్కడ ఉన్నాయి. ఎన్ని కిలోమీటర్ల దూరంలో ఉన్నాయి. తీగలు తెగటం, డిస్క్, ఇన్సులేటర్, ట్రాన్స్‌ఫార్మర్లు ఫెయిల్ తదితర బ్రేక్‌డౌన్స్ సమాచారం వెంటనే తెలుస్తోంది. లొకేషన్‌కు సిబ్బంది తొందరగా చేరుకునే వీలు కలుగుతుంది. తక్కువ సమయంలో సరఫరా పునరుద్ధరణకు వెసులుబాటు కలగనుంది. ఇలా సబ్‌స్టేషన్ పరిధిలోని చివరి పోల్ వరకు రోడ్డు క్రాసింగ్ వద్ద అండర్‌గ్రౌండ్ కేబుల్‌తో సహా సమస్యను జీఐఎస్ మ్యాపింగ్‌తో గుర్తించి పరిష్కరిస్తారు.

మరో నెలలో మ్యాపింగ్ పూర్తి



జిల్లాలో 432కి.మీ.11కేవీ, 59 కి.మీ. పొడవు 33/11కేవీ ఫీడర్లు ఉన్నాయి. మొత్తం 97 సబ్‌స్టేషన్‌లు ఉన్నాయి. వీటి పరిధిలోని ఎన్ని స్తంభాలు వాటి కేటగిరి తదితర నెట్‌వర్క్ వివరాలు ఏయిమ్స్ మొబైల్ యాప్‌లో అందుబాటులో ఉంటాయి. మరో నెలలో జీఐఎస్ మ్యాపింగ్ ప్రక్రియ ముగియనుంది. ఈ మొబైల్ యాప్ ద్వారా నిర్వహణ లోపాల గుర్తింపు, సత్వర పరిష్కారం, వినియోగదారులకు మరింత మెరుగైన విద్యుత్ పంపిణీ సేవలు అందనున్నాయి. లైన్‌మెన్ల నుంచి ఏఈ, ఏడీఏ, డీఈ, ఎస్‌ఈల వరకు ఎవరి పరిధిలో వారికి యాప్ ద్వారా బ్రేక్‌డౌన్ తదితర సమస్యల సమాచారం వెంటనే తెలుస్తుంది.

– సుధీర్‌కుమార్, ఎస్‌ఈ యాదాద్రి జిల్లా


స్టీల్‌ప్లేట్‌లో భోజనం చేస్తున్న ఉపాధ్యాయురాలు విజయకుమారి


స్టీల్‌ప్లేట్‌లో భోజనం చేస్తున్న ట్రైనర్ సంజీవులు

స్టీల్ ప్లేట్‌లోనే భోజనం

పర్యావరణాన్ని పరిరక్షించడంలో పాలు పంచుకోవాలనే ఉద్దేశంతో ఎక్కడికి వెళ్లినా, ఫంక్షన్ కి వెళ్లినా తమ బ్యాగులో స్టీల్ ప్లేటు, స్టీల్ వాటర్ బాటిల్ తెచ్చుకుంటారు. ఆ ప్లేట్‌లోనే భోజనం చేస్తారు. నల్లగొండ జిల్లా తిప్పర్తికి చెందిన ఉపాధ్యాయురాలు బి.విజయకుమారి సోమవారం నల్లగొండ పట్టణంలోని జిల్లా విద్యా శిక్షణ కేంద్రం (డైట్)లో ఉపాధ్యాయులకు నిర్వహించిన చైల్డ్ సేఫ్టీ, హ్యూమన్ ట్రాఫికింగ్‌పై శిక్షణకు హాజరయ్యారు. ఆమె భోజన సమయంలో స్టీల్ ప్లేట్‌లో తినడం, స్టీల్ వాటర్ బాటిల్‌తో నీళ్లు తాగారు. అదేవిధంగా ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వడానికి వచ్చిన కామారెడ్డి జిల్లాకు చెందిన ఉపాధ్యాయుడు సంజీవులు కూడా స్టీల్ ప్లేట్‌లోనే తినడం గమనార్హం. వీరు ఇరువురు 'సాక్షి'తో మాట్లాడుతూ.. తాము ఎక్కడికి వెళ్లినా స్టీల్ ప్లేట్ లోనే భోజనం చేస్తామని, తమ వెంటే బ్యాగులో ప్లేటు తెచ్చుకుంటామని చెప్పారు.

– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నల్లగొండ

సిలిండర్ పేలి పూరిగుడిసె దగ్ధం

మిర్యాలగూడ టౌన్ : ప్రమాదవశాత్తు గ్యాస్ సిలిండర్ పేలి పూరి గుడిసె దగ్ధమైంది. ఈ సంఘటన సోమవారం మిర్యాలగూడ మండలంలోని శ్రీనివాస్‌నగర్‌లో చోటుచేసుకుంది. శ్రీనివాస్‌నగర్‌కు చెందిన సత్తిబాబు మిర్యాలగూడలోని ఎఫ్‌సీఐ వద్ద గల శివసాయి రైస్‌మిల్లులో పని చేస్తున్నాడు. రోజు మాదిరిగా సోమవారం డ్యూటీకి వెళ్లాడు. అతని భార్య గ్రామంలో బంధువుల ఇంటికి వెళ్లింది. ఉదయం 11గంటల సమయంలో ప్రమాదశాత్తు గ్యాస్ సిలిండర్ పేలి మంటలు గుడిసెకు అంటుకున్నాయి. స్థానికులు అప్రమత్తమై మంటలు ఆర్పివేశారు. అప్పటికే ఇంట్లో బియ్యం, దుస్తులు తదితర వస్తువులు కాలిపోయాయి. మూడు తులాల బంగారం, 12 తులాల వెండి, సమభావన సంఘానికి సంబంధించి బ్యాంకులో కట్టేందుకు మహిళలు ఇచ్చిన రూ.80 వేల నగదు దగ్ధమయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న మాజీ సర్పంచ్ బోగవల్లి వెంకట రమణ చౌదరి బాధిత కుటుంబానికి రూ.50 వేల ఆర్థిక సాయం చేశారు.

ఎంజీయూలో క్రీడాపోటీలు ప్రారంభం


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న వీసీ అల్తాఫ్ హుస్సేన్

నల్లగొండ టూటౌన్: ఎంజీ యూనివర్సిటీలో సోమవారం అంతర్ కళాశాలల క్రీడా పోటీలు ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను యూనివర్సిటీ వైస్ ఛాన్స్‌లర్ ఖాజా అల్తాఫ్ హుస్సేన్ ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు చదువుతోపాటు తమకు నచ్చిన క్రీడల్లో పాల్గొని రాణించాలన్నారు. క్రీడలతో మానసిక ప్రశాంతత, దేహదారుఢ్యం పెరుగుతుందన్నారు. విద్యార్థుల నాయకత్వ లక్షణానికి క్రీడలు దోహదపడుతాయని తెలిపారు. ప్రతి కళాశాలలో క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేసుకోవాలని, ప్రతి రోజు ఏదో ఒక క్రీడలో విద్యార్థులు పాల్గొనే విధంగా చూడాలని పేర్కొన్నారు. మహిళా విభాగంలో ఫైనల్ పోటీలు తెలంగాణ వెల్ఫేర్ డిగ్రీ కళాశాల నల్లగొండ, తెలంగాణ ఆర్మీ వెల్ఫేర్ డిగ్రీ కళాశాల భువనగిరి మధ్య జరగనున్నట్లు స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ హరీష్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో యూనివర్సిటీ రిజిస్ట్రార్ అలువాల రవి, ఆడిట్ సెల్ డైరెక్టర్ ప్రశాంతి, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ మద్దిలేటి, మురళి, శ్రీనివాస్‌రెడ్డి, శివశంకర్, వ్యాయామ ఉపాధ్యాయులు, కళాశాలల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుప్రమాదంలో మహిళ దుర్మరణం

మఠంపల్లి: మండలంలోని చౌటపల్లి వద్ద సోమవారం రెండు బైక్‌లు ఢీకొన్న ఘటనలో కొత్తతండాకు చెందిన బానోతు మగితి (52) అక్కడికక్కడే మృతి చెందింది. మఠంపల్లి ఎస్‌ఐ బాబు తెలిపిన వివరాల ప్రకారం.. బానోతు మగితి భవన నిర్మాణ కార్మికురాలిగా చేస్తుంది. పని కోసం సోమవారం హుజూర్‌నగర్‌కు వెళ్లింది. సాయంత్రం తన గ్రామానికి వచ్చేందుకు హుజూర్‌నగర్‌లో పాలకీడు మండలం గుండ్లపాడు గ్రామానికి వెళ్తున్న తెలిసిన వ్యక్తి బైక్‌పై లిఫ్ట్ అడిగి ఎక్కింది. ఈక్రమంలో చౌటపల్లి – మఠంపల్లి గ్రామాల మధ్యన రహదారిపై ఎదురుగా వస్తున్న గుర్తు తెలియని వ్యక్తి బైక్ ఢీకొనడంతో ఇద్దరు కింద పడిపోయారు. అదేసమయంలో వెనుకనుంచి వస్తున్న లారీ రోడ్డుపై పడిపోయిన మగితి పైనుంచి వెళ్లింది. నడుముకు తీవ్రగాయాలు కావడంతో అక్కడికక్కడే మృతిచెందింది. బైక్ నడుపుతున్న వ్యక్తి రోడ్డు పక్కన పడిపోవడంతో కాలు విరిగి తీవ్రంగా గాయపడ్డాడు. సమాచారం తెలుసుకున్న ఎస్‌ఐ సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం హుజూర్‌నగర్ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. గాయపడిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు.

మద్యానికి బానిసైన వ్యక్తి మృతి

చౌటుప్పల్ : మద్యానికి బానిసైన వ్యక్తి ఆదివారం రాత్రి మృతిచెందాడు. సీఐ మన్మథకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని తూర్పుగోదావరి జిల్లాకు చెందిన చిలువూరి విజయ్‌కుమార్‌రాజు(42) హైదరాబాద్‌లోని నిజాంపేట రోడ్డులోని కూకట్‌పల్లిలో గత 30ఏళ్లుగా నివాసం ఉంటున్నాడు. అతను గతంలో నెల్లూరు జిల్లాలో చేపల చెరువులను అద్దెకు తీసుకొని రొయ్యల వ్యాపారం నిర్వహించగా అందులో నష్టం రావడంతో ఆర్థికంగా సమస్యలు ఎదుర్కొన్నాడు. దీంతో మద్యానికి బానిసయ్యాడు. ఈక్రమంలో కుటుంబసభ్యులు అతనికి మద్యం మాన్పించేందుకు హైదరాబాద్‌లోని ఓ పునరావాస (రీ హాబిటేషన్ సెంటర్) కేంద్రంలో చేర్పించారు. ఆ సెంటర్ నుంచి తప్పించుకున్న విజయ్‌కుమార్‌రాజు ఇంటికి వెళ్లకుండా జాతీయ రహదారి మీదుగా నడుచుకుంటూ చౌటుప్పల్ వైపునకు వచ్చాడు. స్థానిక తంగడపల్లి రోడ్డులోని ఓ బ్రిక్స్ తయారీ కేంద్రం వద్ద చెట్టు కింద చనిపోయి ఉన్నాడు. ఆదివారం రాత్రి గొర్రెల కాపరి గమనించి పోలీసులకు సమాచారం అందించాడు. ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడి మేనమామ దంతులూరి శ్రీహరిరాజు సోమవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

సాగర్‌కు కొనసాగుతున్న వరద


14 గేట్ల ద్వారా విడుదలవుతున్న వరద నీరు

నాగార్జునసాగర్: సాగర్ వద్ద 14రేడియల్ క్రస్ట్‌గేట్ల ద్వారా కృష్ణమ్మ పరవళ్లు కొనసాగుతున్నాయి. శ్రీశైలం జలా శయం నుంచి 1,67,448 క్యూసెక్కుల వరదనీరు వచ్చి చేరుతుండగా అంతే నీటిని సాగర్ నుంచి దిగువకు విడుదల చేస్తున్నారు. 14క్రస్ట్‌గేట్లు, విద్యుదుత్పాదనతో దిగువ కృష్ణానదిలోకి 1,45,882 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. కుడి,ఎడమ, వరద, ఏఎమ్మార్పీ కాల్వలలకు 21,166 క్యూసెక్కుల నీరువిడుదల అవుతుంది. జలాశయం గరిష్ఠ నీటిమట్టం 590.00అడుగులు, 312.0450 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 589.20 అడుగులు, 309.6546 టీఎంసీలుగా నమోదైంది.

విద్యార్థుల ప్రతిభకు ప్రోత్సాహకం

- కేంద్ర కమ్యూనికేషన్ల మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో ప్రతిభా పోటీలు
- రెండు దశల్లో పరీక్షలు
- ఎంపికైన విద్యార్థులకు నెలకు రూ. 500 చొప్పున ఉపకార వేతనం
- దరఖాస్తుకు 13 వరకు గడువు



చిలుకూరు: కేంద్ర ప్రభుత్వ కమ్యూనికేషన్ల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రతిభా పోటీలు నిర్వహించి ఉపకార వేతనాలను తపాలా శాఖ ద్వారా దీన్‌దయాళ్ స్పర్శ్ యోజన పేరుతో మంజూరు చేస్తోంది. తపాలా బిళ్లల సేకరణ, అధ్యయనం(ఫిలాటెలీ)తో కలిగే ప్రయోజనాలపై పోటీలు నిర్వహించి ఎంపికైన విద్యార్థులకు నెలకు రూ.500 చొప్పున ఉపకార వేతనాలు అందించనుంది. 2024–25 విద్యాసంవత్సరంలో వార్షిక పరీక్షల్లో ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు 55 శాతం, బీసీ, ఓసీలు 60 శాతం మార్కులు సాధించినవారు ఈ పోటీలకు అర్హులు.

రెండు దశల్లో పరీక్ష

రెండు దశల్లో పరీక్ష నిర్వహిస్తారు. ప్రతి రాష్ట్రంలో ఒక్కో తరగతి నుంచి పది మంది చొప్పున (6 నుంచి 9వ తరగతి వరకు) 40 మందిని ఉపకార వేతనాలకు ఎంపిక చేస్తారు. మొదటి దశ పరీక్షలో జనరల్ నాలెడ్జ్‌కు 5 మార్కులు, చరిత్రకు 5, జాగ్రఫీకి 5, సైన్స్‌లో 5, క్రీడలు, సంస్కృతి, పర్సనాలిటీ అంశాలకు 5, లోకల్ ఫిలాటెలీకి 10 మార్కులు, నేషనల్ ఫిలాటెలీకి 15 చొప్పున మొత్తం 50 మార్కులు కేటాయిస్తారు. మొదటి దశలో ప్రతిభ చాటిన వారిని రెండో దశకు ఎంపిక చేస్తారు. రెండో దశలో విద్యార్థులు తపాలా శాఖ ఇచ్చే అంశాలపై ఉత్తమ ప్రాజెక్టు రూపొందిస్తే ఎంపిక చేస్తారు. వారికి ఏడాది పాటు నెలకు రూ. 500 చొప్పున రూ. 6 వేలు చెల్లిస్తారు. ఎంపికైన విద్యార్థుల పేరుతో ప్రత్యేకంగా పొదుపు ఖాతాలు తెరిపించి ప్రతి నెల డబ్బులు జమ చేస్తారు. ఈ నెలాఖరున మొదటి దశ పరీక్ష నిర్వహించి అక్టోబర్‌లో ఫలితాలు విడుదల చేస్తారు. ఆ తరువాత రూపొందించిన ప్రాజెక్టును వచ్చే నెల 30లోగా సమర్పించాలి. తుది ఫలితాలు డిసెంబర్‌లో ప్రకటిస్తారు. ఈ పోటీల్లో అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొనేలా ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు దృష్టి పెట్టాలని డీఈఓ అశోక్ తెలిపారు.

13వ తేదీ వరకు గడువు

అర్హులైన విద్యార్థులు ఈ నెల 13లోగా తపాలా కార్యాలయాల నుంచి దరఖాస్తులు పొందవచ్చు. చదువుతున్న పాఠశాల ప్రధానోపాధ్యాయుల నుంచి స్టడీ సర్టిఫికెట్ తీసుకొని తపాలా కార్యాలయానికి వెళ్లి రూ. 200 చెల్లించి ఫిలాటెలీ డిపాజిట్(పీడీ) ఖాతాను తీసుకోవాలి. అయితే ఈ పథకంపై విద్యార్థులకు పూర్తి స్థాయి అవగాహన లేకపోవడంతో నేటి వరకు ఏ ఒక్క విద్యార్థి కూడా దరఖాస్తు చేసుకోలేదని తపాలా శాఖా వారు చెబుతున్నారు.

రిటైర్డ్ ఉద్యోగికి సైబర్ వల

- పోక్సో కేసు నమోదైందని వాట్సాప్ కాల్
- సుప్రీంకోర్టులో కేసు నడుస్తుందని ఆర్డర్ కాపీ చూపించిన సైబర్ నేరగాడు
- డబ్బులు చెల్లించాలని వేధించడంతో ఎస్పీని ఆశ్రయించిన బాధితుడు

మిర్యాలగూడ: మిర్యాలగూడ పట్టణానికి చెందిన రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగికి ఐదు రోజుల క్రితం ఓ సైబర్ నేరగాడు వాట్సాప్ కాల్ చేసి మీపై పోక్సో కేసు నమోదైందని, అంతర్జాతీయ క్రిమినల్‌తో మీకు సంబంధం ఉందని నమ్మబలికాడు. ఇంట్లో నుంచి బయటకు వెళ్లవద్దని, ఈ విషయం ఎవరికి చెప్పవద్దని మూడు రోజుల పాటు ఇంట్లోనే ఉంచి వాట్సాప్ వీడియో కాల్‌లో ఆధారాలు చూపించి బెదిరించాడు. బెంగుళూరులోని గాంధీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఫేక్ ఉన్నతాధికారి ద్వారా వీడియో కాల్‌లో మాట్లాడించాడు. సుప్రీంకోర్టులో కేసు నడుస్తుందని దాని ఆర్డర్ కాపీ చూపించి ఆ కోర్టు ద్వారానే బెయిల్ ఇప్పించానని, దీనికి గాను రూ.30,70,719 చెల్లించాలని, అది కూడా ఆర్టీజీఎస్ చేయాలని సూచించాడు. ఇదంతా చూసిన రిటైర్డ్ ఉద్యోగి ఈ కేసుతో తనకు సంబంధం లేకపోయినప్పటికీ తాను కేసులో ఇరుక్కున్నానని ఆలోచనకు వెళ్లాడు. అంత డబ్బులు తన వద్ద లేవని తాను ఏ తప్పు చేయలేదని ప్రాధేయపడ్డాడు. చివరికి రూ.20లక్షలు చెల్లించు, మిగతావి నేను చెల్లిస్తానని సైబర్ నేరగాడు నమ్మబలికాడు. అతడి బెదిరింపులకు బాధితుడు మూడు రోజుల పాటు ఇంట్లోనే ఉన్నాడు. చివరకు మాజీ ఎమ్మెల్యేను ఆశ్రయించాడు. దీంతో ఆయన సహకారంతో ఎస్పీని కలిశాడు. ఇది సైబర్ నేరమని తేలడంతో బాధితుడు ఊపిరి పీల్చుకున్నాడు. ఈ విషయంపై డీఎస్పీని వివరణ కోరగా రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగికి సైబర్ నేరగాళ్లు ఫోన్ చేసి డబ్బులు డిమాండ్ చేసిన విషయం వాస్తవమేనని తెలిపారు.

వైన్‌షాపులో చోరీ

- 25 ఫుల్ బాటిళ్ల మద్యం, నగదు, సీసీకెమెరా హార్డ్‌డిస్క్ ఎత్తుకెళ్లిన దొంగలు

శాలిగౌరారం: వైన్‌షాపులో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. ఈ సంఘటన శాలిగౌరారం మండలంలోని పెర్కకొండారం గ్రామంలో ఆదివారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. ఎస్‌ఐ సైదులు తెలిపిన వివరాల ప్రకారం.. పెర్కకొండారం గ్రామ పరిధిలో 365 నంబర్ జాతీయ రహదారి సమీపంలో రేకుల గదులతో నిర్మించిన ఇంటిలో శ్రీసాయి వైన్ షాపు నిర్వహిస్తున్నారు. రోజు మాదిరిగా నిర్వాహకులు ఆదివారం రాత్రి 10 గంటలకు వైన్స్‌ను మూసివేసి ఇంటికి వెళ్లారు. అర్ధరాత్రి సమయంలో గుర్తుతెలియని దొంగలు షాపు పైకప్పు రేకును తొలగించి లోపలికి చొరబడ్డారు. క్యాష్‌కౌంటర్‌లో సుమారు రూ.10 వేల నగదు, మద్యం ఫుల్ బాటిళ్లు ఉన్న రెండు కాటన్లు, ఒక బ్లెండర్‌ప్రైడ్ రిజర్వ్ ఫుల్‌బాటిల్, సీసీ కెమెరా హార్డ్ డిస్క్‌ను ఎత్తుకెళ్లారు. సోమవారం ఉదయం వైన్స్ షాపును తెరిచిన సిబ్బంది షాపులో దొంగతనం జరిగినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. శాలిగౌరారం సీఐ కొండల్‌రెడ్డి, ఎస్‌ఐ సైదులు సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. నల్లగొండలోని క్లూస్‌టీం సిబ్బందిని పిలిపించారు. వారు అక్కడకు చేరుకుని వేలిముద్రలను, ఇతర ఆధారాలను సేకరించారు. ఈ మద్యం విలువ సుమారు రూ.22 వేలు ఉంటుందని వైన్ షాపు నిర్వాహకులు తెలిపారు. ఇదిలా ఉండగా.. వైన్‌షాపులో విలువైన మద్యం నిల్వ ఉన్నప్పటికీ కేవలం తక్కువ విలువ కలిగిన మద్యాన్ని దొంగిలించడం గమనార్హం. వైన్ షాపులో క్యాషియర్‌గా పనిచేస్తున్న శ్రావణ్ ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

బత్తాయిలో వేసవి పంటకు అనువైన సమయమిదే..



గుర్రంపోడు : బత్తాయి తోటల్లో కాయల కోతలు చివరిదశలో ఉండి ఇప్పటికే కాయలు కోసిన తోటల్లో వేసవి పంట తెచ్చేందుకు రైతులు సమాయత్తమవుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలు అనంతరం వాతావరణం వేడిగా మారడం వల్ల బత్తాయిలో కొద్దిపాటి వాడు లక్షణాలు కనిపించినా కత్తెర పంటకు అనుకూలంగా ఉంటుంది. బత్తాయిలో వర్షాకాలంలో కోతకు వచ్చే కాయల కంటే వేసవిలో వచ్చే పంటకు రెండింతల ధర అధికంగా లభిస్తుంది. ఈ రెండు సీజన్లలో కాయల ధరల్లో ఎక్కువ వ్యత్యాసానికి వర్షాకాలంలో బత్తాయి కాయల వినియోగం చాలా తక్కువగా ఉండటమే కారణం. వేసవిలో అధిక పంట పొందాలంటే సెప్టెంబర్‌లో చెట్లు వాడుపట్టాలి. ఈ మాసంలో వర్షాలు ఉంటున్నందున కష్టంతో కుదుకున్న పనే అవుతుంది. అయితే వాతావరణ పరిస్థితులు అనుకూలిస్తే ఈ సమయాన్ని సద్వినియోగం చేసుకుని ఇప్పటికే కాయల కోతలు పూర్తయిన రైతులు వేసవి పంట తెప్పించేందుకు చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులు, మెళకువలను హాలియా ప్రాంతీయ ఉద్యానవన శాఖాధికారి మురళి వివరించారు.

లేత తోటలు

బత్తాయి తోటల్లో యాజమాన్య పద్ధతులు అవలంబిస్తే ఐదవ సంవత్సరం నుంచి కాపు వస్తుంది. తోటలను దున్నడం, పాదులు తవ్వడం, ఎండు పుల్లలను తొలగించడం లాంటి అంతరకృషి పనులు పూర్తి చేయాలి. ఆగస్టు, సెప్టెంబర్ మాసాల్లో నీటి తడులను ఆపివేసి చెట్లు వాడుకు గురయ్యేటట్లు చేయాలి.

పాడిపంట

ప్రతి చెట్టుకు 40 కిలోల పశువుల ఎరువు లేదా 10 కిలోల వర్మి కంపోస్టు మూడున్నర కిలోల ఆముదం లేదా వేప పిండి, 600 గ్రాముల యూరియా, 900 గ్రాముల సింగిల్ సూపర్ పాస్పెట్, 400 పోటాష్‌ను కలిపి పాదంతా సమంగా వేసి నీటి తడులు ఇవ్వాలి. ఇలా చేస్తే కాయలు మే మాసంలో కోతకు వస్తాయి. ఈ కాపు నిలబడాలంటే డిసెంబర్, జనవరి మాసాల్లో చెట్లను వాడుకు గురి చేయకుండా నీటిని అందించాలి. అయినప్పటికీ రుతు క్రమాన్ని బట్టి చెట్లలో కొంత పూత వస్తుంది. వర్షాకాలంలో కాయలు వస్తాయి. దీని వల్ల వేసవిలో అధిక పంట, వర్షాకాలంలో సీజన్ పంట తక్కువగా వస్తాయి. ఇలా ఒకటి, రెండు సంవత్సరాలు అలవాటు చేసుకుంటూ పోతె చెట్లు ఈ పద్ధతికి అలవాటు పడతాయి. ఎండాకాలం పంట ఎక్కువగానూ వర్షాకాలం పంట తక్కువగానూ వచ్చి రైతులకు రాబడులు పెరుగుతాయి.

ముదురు తోటలు

ప్రస్తుతం కాపునిస్తున్న ముదురు తోటల్లో వేసవి పంట పెంచేందుకు 50 కిలోల పశువుల ఎరువు, 5 కిలోల వేప పిండి లేదా ఆముదం పిండి, 750 గ్రాముల యూరియా, 1200 గ్రాముల సింగిల్ సూపర్ పాస్పెట్, 500 గ్రాముల పోటాష్‌లను ప్రతి చెట్టుకు వేసి నీరందించాలి. దీంతో కొత్తగా వచ్చిన చిగురు, రెమ్మలను పురుగుల బారి నుంచి కాపాడుకునేందుకు లీటర్ నీటికి 1.5 మిల్లీలీటర్ల మోనోక్రోటోపాస్ మందును పిచికారీ చేయాలి. సూక్ష్మ పోషక లోపాలను సవరించేందుకు 5 గ్రాముల జింక్ సల్ఫేట్, 2 గ్రాముల మెగ్నీషియం సల్ఫేట్, 2 గ్రాముల మాంగనీస్ సల్ఫేట్, 2 ఫెర్రస్ సల్ఫేట్, 1 గ్రాము బోరాక్స్, 6 గ్రాములు సున్నం, 10 గ్రాముల యూరియాను లీటర్ నీటికి చొప్పున కలిపి 15 రోజుల వ్యవధిలో ద్రావణాన్ని రెండు సార్లు చెట్లప పిచికారీ చేయాలి. ఈ వేసవి కాపు చెట్టుపై అధికంగా ఉంటే జనవరి మాసంలో మళ్లీ చెట్లకు వాడు అవసరం లేకుండానే సాధారణంగా వచ్చే పంటను మాత్రమే తీసుకోవాలి.

చీడపీడల నివారణ

వర్షాకాలంలో బత్తాయి తోటల్లో ఎక్కువగా గజ్జి తెగులు, కాయ తొడిమ కుళ్లు తెగులు, దోమకాటు ఎక్కువగా సోకుతాయి.

గజ్జి తెగులు : ఈ తెగులు బత్తాయి, నిమ్మ తోటలకు వర్షాకాలంలో ఎక్కువగా సోకుతుంది. గజ్జి మచ్చలు ఆకులు, కొమ్మలు, ఆకు తొడిమలపై ఏర్పడతాయి. దీని నివారణకు తెగులు సోకిన ఎండు కొమ్మలను కత్తిరించి నాశనం చేయాలి. 10 లీటర్ల నీటిలో 1 గ్రాము సెప్టో సైక్లిన్, 30 గ్రాముల కాపర్ ఆక్సిక్లోరైడ్ మందును వర్షాకాలంలో 20 రోజులకు ఒక్కసారి రెండు సార్లు పిచికారీ చేయాలి.

దోమకాటు : బత్తాయి పండ్లు పక్వానికి వచ్చే దశలో దోమలు రాత్రిపూట కాయలపై కాటు వేసి రసాన్ని పీల్చడం వల్ల విపరీతమైన నష్టం ఏర్పడుతుంది. ఈ తెగులు ఆశించిన కాయలు కుళ్లిపోయి రాలిపోతాయి. దీని నివారణకు తోటల్లో రాత్రి పూట లైట్లు పెట్టి అక్కడక్కడా ప్లేట్లలో మలాథీయాన్ ఒక మిల్లీ లీటర్ మందును ఒక శాతం చక్కెర, పండ్లరసంతో కలిసి విషప్పు ఎరను ఉంచాలి. వెళుతురుకు దోమలు ఆకర్షించబడి మిశ్రమాన్ని పీల్చి చనిపోతాయి.

కాయ తొడిమ కుళ్లు తెగులు

మొదట తొడిమకు దగ్గరగా కుళ్లు మచ్చ ఏర్పడుతుంది. మచ్చ వక్క రంగులో తొడిమ చుట్టూ కాయపై ఏర్పడుతుంది. క్రమంగా ఈ మచ్చ కాయంతా వ్యాపించి లోపలి భాగాలు కుళ్లి మెత్తబడతాయి. తెగులు సోకిన కాయలు రాలిపోవడం గాని లేదా ఎండి చెట్లు అంటిపెట్టుకుని ఉంటాయి. దీని నివారణకు వర్షాకాలంలో నెలకొకసారి 1 గ్రాము కార్బండిజం మందును ఒక లీటర్ నీటికి కలిపి కాయలు పూర్తిగా తడిసేలా పిచికారీ చేయాలి.